## వెలుగు చీకటి

సుందరయ్య వాహనం ఆ జంక్షన్ దగ్గరకొచ్చేసరికి సడన్ బ్రేక్‌తో ఆగిపోయింది. కారణం ఆ దృశ్యం...

సరిగ్గా పదిహేను రోజుల క్రితం చూశాడు. మళ్లీ ఈ రోజు తను ఈ ఏరియాకు వచ్చి నెలయింది. తన ప్రాజెక్ట్ ప్రారంభించింది లగాయితు రెండోసారి ఈ దార్లో రావడం. టైమ్ చూసుకున్నాడు. తొమ్మిది. అమావాస్య చీకటి. ఆ జంక్షన్‌లోని వీధి లైటు వెలగడం లేదు. ఆ చీకటి ఛాయలో మిణుకు మిణుకు మంటున్న తారల్లా ఆ ఆడకూతుళ్లు.

రోడ్డు మీద నుంచి వెళ్లే వాహనాల వెలుగులో గుప్పుమని వెలిగి మళ్లీ చీకట్లో కలిసిపోతున్నారు. బాగా దట్టంగా చేసిన మేకప్, రంగు రంగుల్లో వస్త్రధారణ, వారు చేసే వ్యాపారం ఏమిటో చెప్పకనే చెబుతున్నాయి.

సుందరయ్య మొదటిసారి వాళ్లను చూసినప్పుడు అంత తీవ్రంగా స్పందించలేదు. ఈ సారి మాత్రం అతడి స్పందన వేరుగా వుంది. కారణం ఆ జంక్షన్‌కు కొంచెం దూరంలో వున్న ఏదో రెసిడెన్షియల్ కాలేజి. ఆ కాలేజీ కుర్రాళ్ళు గుంపులు గుంపులుగా ఈ జంక్షన్ దగ్గరనించున్నారు... అంటే వాళ్ళూ... వీళ్లు పరస్పరం పాడవుతూ పతనావస్థకు చేరుకుంటూ... ఈ నగరంలో ఇంతమంది

ఇలా పాడవుతుంటే వీళ్ళను సంస్కరించేవాళ్లే లేరా?

సుందరయ్యలో పరిపరి విధాల ఆలోచనలు.

క్షణంసేపు అలాగే నిలుచున్నాడు వారిని చూస్తూ, వారి వ్యాపారం ఆ చీకటి ప్రదేశంలో సజావుగా సాగుతోంది. అక్కడో లైటు వేయిస్తే ఆ కార్యక్రమం ఆగిపోయినట్టేగా! సుందరయ్య స్కూటర్ స్టార్ట్ చేసి ఇంటికి చేరుకునే వరకూ ఆలోచనలు సాగుతూనే వున్నాయి.

తరువాత రోజు ఎలక్ట్రిసిటి ఆఫీసుకు ఫోన్ చేసి చెప్పాడు సుందరయ్య, అవతల ఫోన్ ఎత్తిన ఇంజనీరు గారితో అయ్యా, నేను ఈ ఊళ్లో క్రొత్తగా ప్రారంభించిన అగ్రికల్చర్ ఫారమ్, కో ఆర్డినేటర్‌ను, మా ఫారమ్ నించి వచ్చే వాహనాలకు ఆ రెసిడెన్షియల్ కాలేజీ జంక్షన్‌లో లైటు వేయకపోవడంతో ఇబ్బందిగా వుంది, మా ప్రాజెక్టుకు ప్రభుత్వ సబ్సిడీ వుంది, మీరు దయచేసి ఆ జంక్షన్‌లో లైటు వేయించాలి... సుందరయ్య మాటలకు అవతల వ్యక్తి వెంటనే స్పందించి "తప్పక వేయిస్తాం" అనగానే ఫోన్ కట్ చేశాడు.

'తన ప్రాజెక్టు గురించి చెపితేనే గానీ పనికాదు, కారణం ఈ రెండు నెలల్లో తన ఫారమ్‌కు ఆ చుట్టుపక్కల నుంచి వచ్చిన పేరు. వ్యవసాయశాఖలో పనిచేసి జిల్లా స్థాయి అధికారిగా రిటైరైన తను రసాయనిక ఎరువులు వాడకుండా ప్రకృతిసిద్ధమైన ఎరువులతో కూరగాయలు పండించే ఫారమ్ ప్రారంభించాడు. ప్రభుత్వం నించి తీసుకున్న పదెకరాల లీజు స్థలంలో జిల్లా కలెక్టర్ తన పనితనం మెచ్చుకున్నాడు తన రిటైర్మెంటు జీవితం వృధాకాకుండా ఒక శాస్త్రీయ కార్యక్రమానికి ఉపయోగపడుతున్నాడు. కొడుకులు స్థిరపడ్డారు. భార్య కాలం చేసింది. అపార్ట్‌మెంటులో తనది ఒంటరి జీవితం. తన జీవితపు లక్ష్యంగా ఈ ప్రాజెక్టు' తృప్తిగా నిట్టూర్చాడు సుందరయ్య.

* * * * *

రెండు రోజుల తర్వాత తన ఫారమ్‌లో పని పూర్తిచేసుకుని వస్తున్న సుందరయ్య వాహనం మళ్లీ ఆ జంక్షన్‌లో ఆగిపోయింది. అక్కడ దేదీప్యమానంగా లైటు వెలుగుతోంది. ఇదివరలో కనిపించి అతణ్ణి కకావికలం చేసిన దృశ్యం మాయమైంది. సుందరయ్య ఆనందంగా తన వాహనాన్ని ముందుకు నడిపించాడు.

అయితే, ఒక ఫర్లాంగు దూరం ప్రయాణం చేసేసరికి ఇంకో జంక్షన్ దగ్గర వెలగని వీధిలైటు అక్కడ చీకటి వ్యాపారపు నీడలు. పతనావస్థకు చేరువగా పిచ్చి తల్లులు..

సుందరయ్య మనసు వికలమయింది. 'తను లైటు వెలిగిస్తే వారి వ్యాపారం మూతపడుతుందనుకున్నాడు... కానీ మరో చోట అది మొదలయింది. అక్కడా వీధి లైటు వేయించి ఆ చీకటిని దూరం చేస్తే మరో చీకటి కూడలిలో మొదలు పెడతారా? ఔను తప్పదు తను మొండివాడు, తన పని తాను చేసుకుపోతాడు... ఈజంక్షన్‌లోనూ లైటు వెయ్యడం గురించి రేపు ఎలక్ట్రిసిటీ ఆఫీసుకు వెళ్ళి చెప్పాలి' అలా అనుకుంటూ కొంచెం భారమయిన హృదయంతో సుందరయ్య ముందుకు కదిలాడు.

* * * * *

తరువాత రోజు మధ్యాహ్నం, భోజనం చేసిన తర్వాత కాసేపు కునుకు తీసి ఎలక్ట్రిసిటీ ఆఫీసుకు బయలుదేరడానికి తయారవుతున్నాడు సుందరయ్య.

ఇంతలో అతడి అపార్ట్‌మెంట్ ఎదురుగా వుంటున్న స్టూడెంట్ కుర్రాళ్ళ గది ముందు హడావుడి కనిపించి తలుపు తీసాడు. ఆ కుర్రాళ్ళ గుమ్మం ముందు సేల్స్‌గరల్ నించునివుంది. చామన ఛాయ రంగులో వున్నా ఆకర్షణీయమైన ముఖం. దానితో పాటూ నవ్వే కళ్లు. చలాకీగా కనిపిస్తోంది. ఆ అమ్మాయి రెండు చేతుల్లోనూ రెండు బరువైన సంచులు. వాటి నిండా బిస్కట్ పాకెట్లు, అప్పడాలు, పచ్చడి పాకెట్లు, 'సార్ ఒక పాకెట్టయినా కొనండి' అంటూ వారిని ప్రాధేయపడుతోంది.

ఆ బ్యాచులర్ కుర్రాళ్ళు ఆమెను గుచ్చి గుచ్చి చూస్తూ బేరం ఆడుతున్నారు.

ఇంతలో ఒక కుర్రాడడిగేడు, "ఇవన్నీ అమ్మితే వచ్చే లాభం ఎంత?" అని.

"పాకెట్టుకు అర్ధ రూపాయి. ఇరవై పాకెట్లు అమ్మితే పది రూపాయలు.. అంతే..." అంది. ఆ కుర్రాడు ఆమె వంక వెకిలిగా చూస్తూ "అంతకు పది రెట్లిస్తాను... ఒక గంట అంతే..." అన్నాడు.

ఆ మాటలకు ఆమె తలొంచుకుంది. ఆమె కళ్లల్లో నీళ్లు గుండు సూదితో గుచ్చితే వచ్చే రక్తంలా మెల మెల్లగా వస్తున్నాయి.

వస్తున్న కన్నీటిని ఆమె ఆపుకుంటూ...

'బాబూ నేను సేల్స్ గర్ల్‌ని, సేలయ్యే గర్ల్‌ని కాదు, అది ఒకప్పటి మాట, ఆ జీవితం వద్దనుకున్నాను. ఇప్పుడు సేల్స్‌గర్ల్‌గా బతుకుతున్నాను, మళ్లీ నన్ను ఆ చీకటి గతంలోకి లాగకండి..' అలా అంటూ ఆమె అక్కణ్ణించి గబగబా కదిలింది.

ఆ బాచిలర్ కుర్రాళ్ళు భళ్ళున తలుపేసుకున్నారు. వెళ్తున్న ఆమెను చూస్తూ ఆలోచనలో పడ్డాడు సుందరయ్య.

అంటే వారి చీకటి జీవితంలో వెలుగులు నిండితే ఆ నిర్భాగ్యులు బైటికొస్తారన్నమాట! తనువీధి లైటు వెలిగిస్తే వారి జీవితాలు బాగుపడతాయినుకున్నాడు కానీ, మరో చోట చీకట్లో వారు తమ వృత్తిని కొనసాగిస్తున్నారు, అలా కాక వారి జీవితాలకు ఎవరైనా బ్రతుకుతెరువు చూపే లైటు వెలిగిస్తే!

సుందరయ్యలో ఆలోచనలు సాగుతున్నాయి

*- ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక, 12 మే, 2001*

* * * * *